

విమానాశ్రయానికి భూములు ఇవ్వం

ప్రజాశక్తి - తొండంగి

బెండపూడి ప్రాంతంలో నిర్మించే విమానాశ్రయానికి తమ భూములను ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. శనివారం మండలం లోని బెండపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో తహశీల్దార్ మురార్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 270 మంది రైతులు తహశీల్దార్‌కు వినతిపత్రాలను అందజేశారు. తమ భూములను విమానాశ్రయ నిర్మాణానికి ఇవ్వమని వినతిపత్రాలను ఇచ్చారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేస్తామని తహశీల్దార్ తెలిపారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బియ్యం దొంగలను ఎందుకు పట్టుకోలేదు?

- సిపిఎం బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- పెద్దాపురంలో కాకినాడ జిల్లా మహాసభ ప్రారంభం
- భారీ ప్రదర్శనతో ఎరుపెక్కిన పట్టణం, ఆకట్టుకున్న కళారూపాలు



బహిరంగ సభకు హాజరైన ప్రజలు,ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పెద్దాపురం

సినిమా డైలాగు మాదిరిగా 'సీజ్ ద షిప్' అన్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రెండు నెలలుగా బియ్యం దొంగలను ఎందుకు పట్టుకోలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. కాకినాడ జిల్లా సిపిఎం 24వ మహాసభలో భాగంగా శనివారం పెద్దాపురంలో భారీ ప్రదర్శన, అనంతరం ఆంజనేయస్వామి గుడి సెంటర్లో బహిరంగ సభ జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశాన్ని పాలిస్తున్న మోడీ అభివృద్ధి పక్కన పెట్టి అదానీ 'సేవలో' మునిగిపోతున్నారన్నారు. చివరకు సూర్యరశ్మిని కూడా అదానీకి అమ్ముకున్నారన్నారు. విద్యుత్ బిల్లులు, వస్తువుల భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను ప్రధాని స్థానంలో ఉన్న మోడీ వెనకేసుకుని రావడం శోచనీయమన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలను చేకూర్చేందుకు జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొస్తున్నారన్నారు. జమిలి ఎన్నికల వల్ల రాష్ట్రాలు ఉనికిని కోల్పోతాయన్నారు.

పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌ను గెలిపించుకుంటే జిల్లా అంతా పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసించారన్నారు. అయితే ఆరు నెలలు దాటినా ఎక్కడా అభివృద్ధి జాడలేదన్నారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని విమర్శించారు. ఒక్కరి పైన కూడా కేసును ఎందుకు నమోదు చేయలేదన్నారు. యాంకరేజ్ పోర్టును మూసివేసి ప్రైవేటు వ్యక్తులకు లాభాలు చేకూర్చేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారన్నారు. కార్మికుల పొట్టను కొట్టి పోర్టును మూసివేసే కుట్రలు మానుకోవాలన్నారు. అధికారంలోకొస్తే పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని, పరిశ్రమలు తీసుకొస్తామని ప్రజల ఆదాయాలను పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కాని ఇలాంటి చర్యలేవీ తీసుకోలేదన్నారు.

సనాతన ధర్మం పేరుతో పవన్ కళ్యాణ్ కొత్త నాటకానికి తెరలేపారన్నారు. ప్రజలు బిజెపి మతోన్మాద రాజకీయాలపై ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. టిడిపి, వైసిపి, జనసేన వైఖరిని గమనిస్తూ ఉండాలన్నారు. మోడీకి లొంగిపోయిన ప్రతి పార్టీ పక్కకు పోయిందని తెలిపారు. మోడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలే నిలబడ్డాయన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్దాపురం పెట్టింది పేరు

1950 నుంచి పెద్దాపురం ప్రాంతం కమ్యూనిస్టు ఉద్యమానికి పెట్టింది పేరన్నారు. యానపు సూర్యారావు వంటి కమ్యూనిస్టు నాయకులు ఇక్కడ పోరాడిన చరిత్ర ఉందన్నారు. పెద్దాపురంలో ప్రజలు అనేక సమస్యలపై పోరాడుతున్నారని గుర్తు చేశారు. పెద్దాపురంలో 30 పడకల ఆసుపత్రి 100 పడకల స్థాయికి తీసుకువెళతామని హామీ ఇచ్చిన పాలకులు నేడు పట్టించుకోవడం లేదన్నారు. ఏలేరు ఆధునికీకరణ మాట మరిచారన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు.

సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఏలేరు ఆధునికీకరణ లేక రైతులు నష్టాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల సాగే, చక్కెర ఫ్యాక్టరీలు మూతబడ్డాయన్నారు. సిపిఎం మహాసభల్లో ప్రత్యామ్నాయ విధానాలను చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తా మన్నారు. సిపిఎం జిల్లా నాయకులు జి.బేబిరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభజన హామీల మాట మరిచిందన్నారు. స్కీం వర్కర్ల సమస్యలను పట్టించుకోవట్లేదన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, రక్షణ, ఆరోగ్య సౌకర్యాలు కరువయ్యాయన్నారు. జీడీ పిక్కల పరిశ్రమల కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు.

సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో జనాభా పెరుగుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూడం లేదన్నారు. సభకు సిపిఎం నాయకులు సూరిబాబు ఆహ్వానం పలకారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు, నాయకులు దువ్వా శేషబాబ్జి, కెఎస్ శ్రీనివాస్, కరణం ప్రసాదరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

బలమైన వర్గపోరాటాలు నిర్మించాలి

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు

రానున్న రోజుల్లో బలమైన వర్గపోరాటాలను నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం కాకినాడ జిల్లా మహాసభలో భాగంగా శనివారం నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి నిధులను తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకోవాలన్నారు. విద్యుత్ సంస్కరణలు, విద్యుత్ భారాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలన్నారు. అదానీ కోసం పనిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతంగా క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలన్నారు.



ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

మోడీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంతో కూడా జమిలి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకొచ్చిందన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు అంబేద్కర్ అంశం తెరపైకి తెచ్చారన్నారు. పార్లమెంటులో జరుగుతున్న పరిణామాలను అందరూ గమనించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఏదొక రూపంలో జమిలి బిల్లును నెగ్గించుకోవడానికి ప్రయత్నం జరుగుతుందన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీలో మెజారిటీ సభ్యులు బిజెపికి అనుకూలంగా ఉన్నవారే ఉన్నారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బిజెపి ఏజెండాను రాష్ట్రంలో అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ మహాసభకు కరణం ప్రసాదరావు, జి.బేబిరాణి, సిహెచ్.రమణి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత సభా ప్రాంగణంలో సిపిఎం పతకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. అలాగే సంతాప తీర్మానాన్ని కెఎస్.శ్రీనివాస్ ప్రవేశ పెట్టారు. . ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ నాయకులు ఎవి నాగేశ్వరరావు, జిల్లా నేతలు ఎం.రాజశేఖర్, కె.శ్రీనివాస్, శేషబాబ్జి, బేబిరాణి, కె.ప్రసాద్, ఎన్.సూరిబాబు, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.



సిపిఎం జెండాను ఆవిష్కరిస్తున్న దారపురెడ్డి సత్యనారాయణ



ఆకట్టుకున్న కళారూపాలు

మహాసభలో ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విప్లవగీతాలు ఉత్సాహాన్ని రేకెత్తించాయి. కళాకారులు రొంగల వీర్రాజు, డి.కృష్ణ, ఎం.రాంబాబు, డి.సత్యనారాయణ, జె.శ్రీను, కే.నాగు, మాగాపు నాగు, లోవరాజుల బృందం ఆలపించిన గీతాలు ఉత్తేజాన్ని నింపాయి. ఎస్‌కె.గౌస్ మొహిద్దీన్, నియాజుద్దీన్, సిహెచ్.వీరబాబు, ఎ.లేఖ్య, వై.లీలా కుమారి, సూర్య కళ, పూజిత, దుర్గాదీపిక, బంగారు రాజు, సూర్య అఖిల ల బృందం ప్రదర్శించిన కళారూపాలు కట్టిపడేశాయి. ప్రజల్లో ఆలోచనను రేకెత్తించాలి.



నల్ల వస్త్రాలు ధరించి నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలని కార్మికులు శనివారం నల్ల వస్త్రాలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ జీడిపిక్కల ఫ్యాక్టరీ మూసి వేయడం వలన 24 గ్రామాలకు చెందిన 409 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. గత నెల 16వ తేదీన యాజమాన్యం అర్ధాంతరంగా మూసివేసి పరారైనప్పటి నుంచి కార్మికులు అనేక విధాలుగా ఆందోళనలు చేస్తున్న పట్టించుకున్న నాధుడే కరువయ్యారన్నారు. ఈ విషయమై ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు మొర పెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎ.వీరబాబు, గోవింద్, కృష్ణారావు, ధర్మాజీ, ఒ.దుర్గాప్రసాద్, గోపి, లోవరాజు, శివ, జయలక్ష్మి, అన్నపూర్ణ, ఒ.దుర్గ, చంటి, శివలక్ష్మి నాయకత్వంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు

కూటమికే ప్రాజెక్టు కమిటీలు

జిల్లాలోని వివిధ ప్రాజెక్టు కమిటీలకు జరిగిన ఎన్నికల్లో ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కలెక్టరేట్‌లో ఈ ఎన్నికలను అధికారులు నిర్వహించారు. ఎన్నికైన వారికి అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం


యు.కొత్తపల్లి, కాకినాడ తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా యు.కొత్తపల్లి మండలం ఎండపల్లికి చెందిన జనసేన పార్టీ నాయకుడు మురాలశెట్టి సునీల్ కుమార్ ఎంపికయ్యారు. శనివారం కలెక్టరేట్‌లో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. తూర్పు డెల్టా పరిధిలోని 16 సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సునీల్‌కుమార్, తమలంపూడి సుధాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు వారికి నియామకపత్రాలను అందజేశారు. ఎన్నికైన సునీల్‌కుమార్‌ను ఎంఎల్‌ఎలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, పిఠాపురం నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు అభినందించారు. ఈసందర్భంగా ఛైర్మన్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ తూర్పు డెల్టా పరిధిలో సుమారు 5 లక్షల ఎకరాలు పైబడి సాగులో ఉందని, సాగునీటి అంశంలో ప్రతీ రైతుకూ న్యాయం చేస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా అవకాసం కల్పించిన జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురం పాదగయ క్షేత్రం నుంచి గొల్లప్రోలు మీదుగా చేబ్రోలులోని పవన్ కళ్యాణ్ నివాసం వరకూ భారీ ర్యాలీ జరిగింది. ఆయనకు పిఠాపురం నియోజకవర్గానికి చెందిన రైతులు ఘనంగా స్వాగతం పలికారు. **గండేపల్లి** తోట వెంకటాచలం పుష్కర ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన అడబాల భాస్కరరావు, వైస్ ఛైర్మన్‌గా కుర్ర వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ఎంఎల్‌ఎ, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూతోపాటు, కూటమి పార్టీల నాయకులు పోతుల మోహనరావు, కోర్పు సాయితేజ, పరిమి బాబు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, జీను మణిబాబు, కందుల బాబ్జి, అడబాల ఆంజనేయులు, యర్రంశెట్టి బాబ్జి, చల్లా రామ్మూర్తి, పాలచర్ల సత్యనారాయణ, తవటం వీరభద్రరావు అభినం దించారు. **పెద్దాపురం** ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్‌గా బస్వా సత్యనారాయణ, వైస్ ఛైర్మన్‌గా ఊటా ఆదివిష్ణు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్టు ఇఇ శేషగిరిరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామానికి చెందిన బస్వా వీరవెంకటనాగేంద్ర, పిఠాపురంకు చెందిన ఊటా ఆది విష్ణు ఒక్కొక్క నామినేషన్ వేశారు. దీంతో వారిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరపుల సత్య ప్రభ, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు వారిని అభినందించారు. **కోటనందూరు** తాండవ రిజర్వాయర్ ప్రాజెక్టుకు ఛైర్మన్‌గా కరక సత్యనారాయణ, వైస్ ఛైర్మన్‌గా కోటనందూరు మండలం భీమవరపుకోట గ్రామానికి చెందిన మేడపురెడ్డి జోగుబాబు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. తాండవ రిజర్వాయర్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ కమిటీ సభ్యులుగా పారుపల్లి వరహాలు బాబు, లోకవరపు కుల్లయ్యానాయుడు ,షేక్ బడా సాహెబ్ సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా సత్యనారా యణ, జోగుబాబును టిడిపి నాయకుడు యనమల రాజేష్, కూటమి నాయకులు గాడి రాజబాబు, అంకమరెడ్డి రమేష్, షేక్ నవాజ్‌జానీ, అల్లంపల్లి నరసింహమూర్తి, దెందేటి పృథ్వీనాగ్ అభినందించారు.



నియామకపత్రాన్ని అందుకుంటున్న సునీల్‌కుమార్



నియామకపత్రాన్ని అందుకుంటున్న భాస్కరరావు



సత్యనారాయణ, జోగుబాబులను అభినందిస్తున్న నాయకులు



నియామకపత్రాన్ని అందుకుంటున్న వీరవెంకటనాగేంద్ర

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కరప

మండల యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నికైంది. శనివారం కాకినాడ యుటిఎఫ్ హోంలో మండల నూతన కౌన్సిల్ సమావేశం వై.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఏలూరు అర్జున్, ప్రధాన కార్యదర్శిగా కెవి.రమణ, గౌరవ అధ్యక్షుడిగా కెఎస్‌ఎన్.మూర్తి, అసోషియట్ అధ్యక్షుడిగా సోమేశ్వరరావు, అసోషియట్ అధ్యక్షురాలుగా వాసంశెట్టి తేజ, కోశాధికారిగా ఎన్. విష్ణు, కార్యదర్శులుగా పి.రాంబాబు, ఎం.సుదర్శనబాబు, వై.శ్రీనివాసరావు, కడలి శ్రీనివాస్, బి.వీరబాబు, పివి.రమణ, కె.సుబ్రమణ్యం, కె.సునందకుమారి ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెవివి.నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ ప్రసాదరావు, పేపకాయల రాజబాబు పాల్గొని మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు.



మండల అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్, రమణ

ఘనంగా రామానుజన్ జయంతి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక శ్రీ అమృత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో శనివారం శ్రీనివాస రామానుజన్ జన్మదిన సందర్భంగా గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకులు సిహెచ్.జానకిదేవి పాల్గొని గణితం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. శ్రీనివాసా రామానుజన్ టాలెంట్ సెర్చ్ టెస్ట్-2024లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులను చెక్ రూపంలో అందజేశారు. విద్యార్థులు తయారుజేసిన వివిధ రకాల గణిత ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ అధినేతలు కె.సంజయ్‌కుమార్, జి.లోవరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



విజేతలకు నగదు బహుమతిని అందిస్తున్న నిర్వాహకులు

క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి - కరప

స్థానిక పల్లపు వీధికి చెందిన యువతకు మండల నీటి సంఘం అధ్యక్షులు పుణ్యమంతుల గంగ సత్యనారాయణ క్రికెట్ కిట్‌ను అందజేశారు. సంక్రాంతికి నిర్వహించే క్రికెట్ టోర్నమెంటులో పల్లపు వీధికి చెందిన యువకులకు క్రికెట్ కిట్లు అందజేయాలని పోలిశెట్టి తాతాలు చేసిన విజ్ఞప్తికి స్పందించిన నీటి సంఘం అధ్యక్షులు శనివారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో రూ.17 వేలు విలువ చేసే క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రికెటర్ అడపా శ్రీనివాస్, క్రీడాకారులు పి.వంశీ, పి.భాస్కర్‌రాజు, ఎస్.సతీష్, ఎన్.విజయ్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.



క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందిస్తున్న నిర్వాహకులు



ఘనంగా మాజీ సిఎం జగన్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - యంత్రాంగం

రౌతులపూడి మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని బంగారియ్యపేటలో వైసిపి నాయకుడు కుర్ర చిట్టిబాబు, ఎస్.అగ్రహారంలో సర్పంచ్ సర్నం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. **సామర్లకోట** నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో స్థానిక వైసిపి కార్యాలయంలోనూ, సిరి మానసిక వికలాంగుల పాఠశాలలోనూ సేవా కార్య క్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగు లకు పండ్లు, రొట్టెలను అందజేశారు. ఈ కార్యక్రమం లో సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్లు వూబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. **జగ్గంపేట** వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి మెయిన్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. భారీ కేకును కట్ చేశారు. సిహెచ్‌సి లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు కార్యాలయం వద్ద, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఒమ్మి రఘురాం నివాసం వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి బిందుమాధవి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **తాళ్ళరేవు** కోరంగి శ్రీ దుర్గా మల్లేశ్వర వృద్ధుల, అనాథ బాలల ఆశ్రమానికి వైసిపి నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు ఆర్థిక సాయంతో రూ.10 వేలు విలువచేసే కిరాణా వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్, ఎంపిటిసి సభ్యురాలు కోరుకొండ కిరణ్ కుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు. జార్జి పేట ఉప సర్పంచ్ పేర్ని ఆదినారాయణమూర్తి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. **ప్రత్తిపాడు** మండలంలోని ధర్మవరంలో వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేశారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బొల్లు చిట్టిబాబు, ఎంపిటిసి జువ్వల బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పెద్దాపురం** నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో జగన్ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్లో కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైస్ ఎంపిపి మిరియాల రాజా, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మండల పరిధిలోని పులిమేరు శాంతివర్ధన వికలాంగుల పాఠశాలలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరి ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. **గొల్లప్రోలు** స్థానిక వైసిపి కార్యాలయంలో జగన్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి వంగ గీతా పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగలి అయ్యారావు, జ్యోతుల బీముడు, పట్టణ అధ్యక్షుడు మైనం రాజా, ఈరుగుల రమేష్ పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** రమణయ్యపేట వైద్య నగర్‌లో వైసిపి జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు నివాసంలో జగన్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురసాల కన్నబాబు మాట్లాడుతూ నాయకుడు అంటే కార్యకర్తలకు ఒక ధైర్యం ఇచ్చేలా ఉండాలని, జగన్మోహన్ రెడ్డి వెనుక మేము అంత ఉన్నామన్నారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం, రమణయ్యపేట బాపన్నదొర కాలనీలో ఆశ్రమ శ్రావణ, ఆదర్శ వృద్ధుల ఆశ్రమం, శ్రద్ధ వృద్ధుల ఆశ్రమంలో రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



కేక్‌ను తినిపిస్తున్న మాజీ మంత్రి కురసాల

వల్లభస్వామికి రూ.1.74 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామం లోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.1.74 లోల ఆదాయం వచ్చిందనిఆలయ కార్యనిర్వ హణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలి పారు. వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,02,180, అన్నదాన విరాళాల ద్వారా రూ.47,065, కేశఖండన ద్వారా రూ.3,960, తులాభారం ద్వారా రూ.200, లడ్డు ప్రసాదం ద్వారా రూ.21,270 వెరసి రూ.1,74,675 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణా చార్యులు, సిబ్బంది, సహాయ సహకారాలు అందించారు.

జాబ్ మేళాలో 32 మందికి ఉపాధి

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 32 మందికి ఉపాధి అవకాశాలు పొందారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మినీ జాబ్ మేళాలో నాలుగు కంపెనీలు ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 86 మంది నిరుద్యోగులు హాజరవ్వగా 32 మంది ఆయా కంపెనీల్లో ఉపాధి అవకాశాలు పొందారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపల్ మురళీ, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, కంపెనీ హెచ్‌ఆర్‌లు, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ రేవతి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బీరువా పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ గ్రామంలో చెక్క బీరువా పడి చిన్నారి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పాడ గ్రామంలో ఉన్న చర్చ్ ఫాదర్ జేసుదాస్ కూతురు, మనవరాలు కొంతకాలంగా ఉప్పాడ చర్చి ఆవరణలో ఉన్న ఇంటిలో ఉంటున్నారు. శనివారం ఉదయం జె.జయకీర్తన(3)పై బీరువా పడడంతో తీవ్రంగా గాయపడింది. కొత్తపల్లి పిహెచ్‌సిలో ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించాలని వైద్యులు తెలిపారు. దీంతో 108కు సమాచారం ఇచ్చారు. గంట ఆలస్యంగా వచ్చిన 108లో కాకినాడకు తరలించే క్రమంలో ఆ చిన్నారి మార్గమధ్యలో మృతి చెందింది. 108 వాహనం సమయానికి వచ్చి ఉంటే చిన్నారి ప్రాణాలు పోయేవి కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

1,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధి సూరంపాలెం రహదారిలో తవుడు ఫ్యాక్టరీ వెనుక పరిసరాలలో శనివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఓటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు పాల్గొన్నారు.

మోటార్ వైర్ల అపహరణ

ప్రజాశక్తి-కడియం

కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేట, బుర్రిలంకలో రెండు రోజులుగా రాత్రి సమయంలో మోటార్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడంతో నర్సరీ రైతులు గగ్గోలు పెడుతున్నారు. వెంకాయమ్మ పేట నుండి కడియం వెళ్లే రోడ్డులోని పలువురు రైతుల నర్సరీల్లో ఇప్పటికే వైర్ల దొంగతనాలు జరగడంతో రైతులు నర్సరీ అసోసియేషన్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో దొంగతనాలు జరిగిన నర్సరీలను పరిశీలించారు. అనంతరం కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గాద నాగేశ్వరావు, డైరెక్టర్‌లు రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళీకృష్ణ, పిల్లా శ్రీనివాస్, తాడాల నాగేశ్వరావు, పిఆర్ఒ గరగ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

90 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు సారా బట్టీలపై దాడి చేసి 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ జెశ్రీనివాస బాలాజీ తెలిపారు. గాదరాడ, కణుపూరు గ్రామాల్లో సుమారు 2400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. తిరుమలాయపాలెం అటవీ ప్రాంతంలో నాటు సారా స్థావరాలను ధ్వంసం చేసి 7 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 90 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు జి.నూకరాజు, ఎ.సతీష్, పి.అనుశ్రీ పాల్గొన్నట్టు తెలిపారు.

బైకుల దొంగ అరెస్టు
10 బైకుల స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

బైకులను అపహరిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 10 బైకులను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ తెలిపారు. సీతానగరం మండలం చుట్టు ప్రక్కల పరిసర ప్రాంతాల్లో బైకుల చోరీలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌పి ప్రత్యేక టీములను ఏర్పాటు చేశారని తెలిపారు. సిఐ సత్య కిషోర్, ఎస్ఐ డి.రామ్ కుమార్, సిబ్బందితో కలిసి నిడదవోలుకు చెందిన బండారి రాముని అరెస్టు చేసినట్టు తెలిపారు. అతడు సీతానగరం మండలం ఉండేశ్వరపురంలో నివాసం ఉంటున్నాడు. గతంలో రాముపై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 కేసులు ఉన్నట్టు తెలిపారు.

వంగలపూడిలో
గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - సీతానగరం

వంగలపూడిలోని సాయిబాబా గుడి వీధి వద్ద పిడబ్ల్యుడి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసుగల వ్యక్తి మృతదేహాన్ని కుళ్లిపోయి గుర్తించని స్థితిలో ఉన్నట్టు తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 9154875175, 9440904832 నెబర్లకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

హత్యాయత్నం కేసు నమోదు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం స్టేషన్ రోడ్‌లో ఒక బంగారం షాప్‌లో చోరీ చేసిన నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని డిఎస్‌పి శ్రీహరిరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. ఉద్దగిరి అఖిల్, మామిడాల రాజు బంగారం షాపులో చోరీ కోసం ముందుగా వారం రోజులపాటు రెక్కీ నిర్వహించారని తెలిపారు. చోరీ చేయడానికి తగిన ఆయుధాలను ముందుగానే సిద్ధం చేసుకున్నారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం హెల్మెట్ ధరించి షాపు ఓనర్ భార్యను ఆయుధంతో దాడి చేయడమే కాకుండా బంగారు ఆభరణాలను దోచుకుపోయారని అన్నారు. ఈ కేసులో ముద్దాయిలను అరెస్టు చేసి హత్యాయత్నం కేసును నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

మండల బడ్జెట్‌కు ఆమోదం

సామర్లకోట : మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన శనివారం ప్రశాంతంగా జరిగింది. రూ.71,500 మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. 2024-25, 2025-26 బడ్జెట్‌ను ఎంపిడిఒ హిమామహేశ్వరి ఆధ్వర్యంలో కార్యాలయ ఎఒ సతీష్‌బాబుప్రవేశపెట్టారు. రూ.100 కోట్ల 91 లక్షల 23 వేల అంచనాతో బడ్జెట్ రూ.71 వేల 500 రూపాయల మిగులుతో బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. బడ్జెట్ అంశాలపై ఎంపిపి, ఎంపిడిఒలు వివరించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాటలు... మంటలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన వాఖ్యలు జిల్లాలో మంటలు రేగాయి. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన బిజెపి వైఖరి మరోసారి దర్శనం పట్టాయి. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు భగ్గుమన్నాయి. ఈ కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా ప్రజలు హాజరై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన గత పదేళ్లలో ఆర్థిక విధ్వంసంతో పాటు సామాజిక సమతుల్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా చేసిన వాఖ్యలు మరింత ప్రకంపనలు సృష్టించాయి. అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలనే డిమాండ్ వ్యక్తమైంది. జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు మిన్నంటుతున్నప్పటికీ కూటమి నాయకుల నుంచి స్పందన కరువైంది. దీంతో ఆయా పార్టీలోనూ చర్చమొదలైంది. ప్రజా ఆందోళనల నేపథ్యంలో కనీసం స్పందించకపోవటం రాబోయే రోజులలో ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రాకతో జోష్

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ రాకతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వ్యక్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్‌లు, మున్సిపాలటీలు పదవీ కాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో తాజా పర్యటన మరింత ఆసక్తి రేపింది. రాబోయే ఏడాది జులైలో ఎన్నికలు అంటూ తీపికబురు చెప్పడంతో టిడిపి శ్రేణుల్లో అప్పుడే హడావిడి మొదలైంది. ఇప్పటికే కార్పొరేటర్లుగా అనుభవం ఉన్న వారితో పాటు కొత్తగా రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన వారు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. తమ అధినేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు జరుగనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు మరింత ప్రత్యేకత సంతరించుకుంది. మరోవైపు కాకినాడ కార్పొరేషన్ పరిధిలో విలీన ప్రాంతాల సమస్యలన్న చక్కదిద్దినట్లయితే కార్పొరేషన్ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లే. జిల్లా విభజన అనంతరం జిల్లా కేంద్రాలలో పట్టణ జనాభా సంఖ్య క్రమంగా పెరుగుతున్న విషయం విదితమే. గ్రామాల నుంచి ఉపాధి కోసం వలసలు రావటమే దీనికి కారణం. నూతన పాలక వర్గాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజా అవసరాలకు తగ్గట్టుగా ఏ మేరకు అభివృద్ధి చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువ

భూ సమస్యలను పరిష్కరిస్తామంటూ జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువలా వస్తున్నాయి. స్థానిక సమస్యలతో పాటు క్షేత్రస్థాయి సిబ్బంది చేసిన పొరపాట్లు సైతం ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 33 రోజులలో సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఏ మేరకు చొరవ చూపిస్తారో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికే పిజిఆర్ఎస్ పేరుతో ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న విషయం విదితమే. ప్రజల విన్నపాలను పూర్తి స్థాయిలో పరిష్కరించకపోవడమనేది అంతేలా గారడీ చేస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర కేంద్రమైన అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో తేటతెల్లమైంది. ఈ పరిస్థితిని ప్రభుత్వం ఎలా చక్కదిద్దుతుందో వేచి చూడాలి.

ఉత్సాహంగా సిపిఎం మహాసభలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సిపిఎం శ్రేణులలో ఉత్సాహం నెలకొంది. ఇటీవల డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభలు పూర్తయిన విషయం విదితమే. తాజాగా కాకినాడ జిల్లా మహాసభలకు రంగం సిద్ధమైంది. రెండ్రోజులపాటు జరిగే ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు సిద్ధమయ్యారు. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా ప్రణాళికలను రూపొందించారు. తూర్పుగోదావరి జిల్లా మహాసభలకు ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. ఇటీవల లోగోను ఆవిష్కరించిన విషయం విదితమే.

'కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి'

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మరణించిన ఉపాధ్యాయులకు సంబంధించి కుటుంబాలకు కారుణ్య నియామకాలు వెంటనే ఇప్పించాలని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు అధికారులను కోరారు. శనివారం జరిగిన జడ్‌పి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 98 మంది దరఖాస్తులు ఉన్నాయని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వానికి లేఖ్ రాసినట్లు చెప్పారు. అది ఎప్పుడు వస్తుందో తెలియదని, ఈ లోగా ఉద్యోగన్నతులు ఇచ్చి వాటి ద్వారా ఖాళీ అయిన పోస్టుల్లో వీరికి అవకాశం ఇవ్వాలని సూచించారు. 2023 -24 సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల జడ్‌పి పిఎఫ్ స్లిప్పులను వెంటనే విడుదల చేయించాలని కోరారు. అమలాపురం మండలం జనుపల్లి జెడ్‌పి పాఠశాల గ్రౌండ్‌ను మెరక చేయించాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఈ ఏడాది స్టడీ మెటీరియల్ ఇస్తారా? లేదా అని ప్రశ్నించారు. దీనిపై సిలబస్ మారిందని మెటీరియల్ సిద్ధం చేయలేకపోయామని అధికారులు చెప్పారు. కాకినాడ జిజిహెచ్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ వెయిటింగ్ ఎక్కువగా ఉంటుందని చెప్పగా ఆధునీకరణలో భాగంగా నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి జడ్‌పి అనుమతుల మేరకు కాంట్రాక్టర్లు పనులు చేశారని, నిధులు లేవని ఈ బిల్లులన్నీ పెండింగ్లో ఉన్నాయని, రూ.5 లక్షల బిల్లులు కూడా చెల్లించడం లేదని చెప్పగా త్వరలోనే కొన్ని బిల్లులు చెల్లిస్తామని సిఇఒ తెలిపారు. అయినవిల్లి మండలం నేదునూరులో 65.40 ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చడం వలన కొనుగోలు అమ్మకాలు నిలిచిపోయాయని, సెక్షన్ 22(ఏ) అనెక్షర్ 3 నుంచి మార్పు చేయాలని కలెక్టర్‌ను కోరారు. నేదునూరులో 15 ఎకరాల చెరువు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా ఆధునీకరించి ఉపయోగంలోకి తేవాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రాపురం, ఆలమూరు మండలాలను, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలో విలీనానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశాలు 10 గంటలు అని చెప్పి అధికారులు, రాజకీయ ప్రతినిధులు ఆలస్యంగా రావడం, ప్రారంభించడం వలన అజెండాకు న్యాయం జరగడం లేదని టైం కు ప్రారంభించాలని సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు.


అప్పారావుకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు ఛైర్మన్‌గా అప్పారావు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు ఛైర్మన్‌గా ఇళ్ల అప్పారావు, వైస్ ఛైర్మన్‌గా బొల్లు సోమన్నదొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు సమక్షంలో ఎంఎల్‌ఎ అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ చేతుల మీదుగా వారికి నియామక పత్రాలను అందించారు. అభినందనలు తెలిపారు. అప్పారావు 20 ఏళ్లుగా టిడిపిలో ఉన్నారు. ఆయన భార్య ఉత్తర కంచి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. పాలక మండల సభ్యులు సుబ్బారెడ్డి సాగర్ అభివృద్ధికి కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెన్న శివ, పర్వత సురేష్, కొమ్ముల కన్నబాబు, బద్ది రామారావు, బొదిరెడ్డి గోపి, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో రికార్డ్

కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ నియోజక వర్గంలో 50వేలకు పైగా టిడిపి సభ్యత్వాలు నమోదు చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని టిడిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మితో కలిసి మాట్లా డారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై టిడిపి సభ్యత్వాన్ని తీసుకుంటున్నారని అన్నారు. వ్యక్తిగతంగా రిఫరల్ ఐడి ద్వారా 17 వేలకు పైగా సభ్యత్వ నమోదు చేయడం ద్వారా రాష్టంలోనే 3వ స్థానంలో నిలిచామని తెలిపారు. సానా సతీష్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

23న రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన

తాళ్లరేవు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తాళ్ళరేవు రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని ప్రజా సంఘాల నాయకులు హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గోవింద రాజులు చిరస్మరణీయుడు

ప్రజాశక్తి - గండేపల్లి

సొసైటీ మాజీ అధ్యక్షులు మేడిబోయిన గోవిందరాజులు చిరస్మరణీయుడు అని పలువురు కొనియాడారు. అబ్బులు ఇటీవలె మతి చెందడంతో ఆయన కుమారులు మేడిబోయిన శ్రీను, శివ రామ కృష్ణ, గంగాధర్, సూర్యచంద్ర రంగప్రకాష్‌లను వైసిపి నాయకులు తోట రాంజీ, మాజీ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, నాయకులు జక్కంపూడి జగపతి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మారోతి శివగణేష్, వత్సవాయి బాబు, రామకుర్తి మూర్తి, చిన్నశంకర్లపూడి ఎంపిటిసి సభ్యులు పిల్లా కొండలరావు వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.

సిసి కెమెరాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కాజులూరు

వ్యాపార సంస్థలు తమ దుకాణాల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని గొల్లపాలెంలో వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చోరీలు అధికమయ్యాయని, వాటిని నివారించేందుకు దుకాణాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - పెద్దాపురం, కాజులూరు, సామర్లకోట

భూ సంబంధమైన సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కాండ్రకోట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సంబంధమైన సమస్యలు ఉన్నవారు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, టిడిపి నాయకులు ఎలిశెట్టి నాని, చక్రప్రకాష్, విఆర్ఒ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి బషీర్, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు. కాజులూరు మండలంలోని అండ్రంగి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శివకుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమం సర్పంచ్ పి.నాగ సుజాత, మండల సర్వేయర్ మూర్తి, విఆర్ఒ ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు. సామర్లకోట మండలంలోని పి.వేమవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తొలుత గ్రామంలోని ఎస్‌సి కాలనీని సందర్శించారు. శ్మశాన వాటికకు స్థలం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి యడ్ల శ్రీనివాస్, గ్రామ నాయకులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ, తాళ్లరేవు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ ఎన్.మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, యోగా శిక్షకులు టి.తేజేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఐ.గౌరీప్రియ, వాలంటీర్లు పాల్గొన్నారు. తాళ్లరేవు మండలంలోని పి.మల్లవరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జి.కృష్ణమోహన్ ధ్యానం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం యోగాసనాలు చేయించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.శ్రీనివాసరావు, పిఇటి రాజేశ్వరి, కూమార్‌శ్రీ, నేతల నాగార్జున, స్కూల్ కమిటీ సభ్యులు పేరాబత్తుల ప్రసన్న పాల్గొన్నారు.

మత్తు లేని నూతన సంవత్సరాన్ని ఆహ్వానిద్దాం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మత్తు, మైకం లేని నూతన సంవత్సరాన్ని ఆహ్వానిద్దామని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.సూర్యనారాయణ సూచించారు. శనివారం రాయవరం రోడ్డు మార్కెట్ సెంటర్‌లో మద్యం మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం మత్తులో కొందరు అనేక దారుణాలకు పాల్పడుతున్నారని అన్నారు. డిసెంబర్ 31 రాత్రి పిల్లలను బయటకు రానీయకుండా పెద్దలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్, మద్యాన్ని తరిమి కొడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు జి.ప్రసాద్, జి.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెవివి నాయకులు


బాబును సత్కరిస్తున్న దేవస్థానం అధికారులు

కుడా ఛైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామిని సత్కరించారు. అనంతరం వేద ఆశీర్వచనాలతో అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆసాధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైక్లింగ్ మంచి వ్యాయామం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సైక్లింగ్ శరీరానికి మంచి వ్యాయామని స్టాన్లీ సైకిల్స్ అధినేత పోతుల స్టాన్లీ స్వరాజ్ అన్నారు. శనివారం స్టాన్లీ సైకిల్స్ ఆధ్వర్యంలో కాకినాడ సైకిల్ అసోసియేషన్ సభ్యులు 150 కిలోమీటర్స్ సైక్లింగ్ డిస్టెన్స్ చేపట్టారు. ఈ మేరకు కాకినాడ నుంచి వైజాగ్ స్టీల్ ప్లాంట్ వరకూ సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో ప్రతిఒక్కరికీ వ్యాయామం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సైకిల్ అసోసియేషన్ సభ్యులు రాంబాబు పాల్గొన్నారు.

ఆదర్శ కాలేజీలో క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శాంటా క్లాజ్ వేషధారణలో అలరించారు. ఆదర్శ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, కళాశాల డైరెక్టర్ అఖిలేష్ మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కొవ్వొత్తుల ప్రదర్శన ఎంతో అలరించాయి. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరావు, వైవిఎస్.రాజశేఖర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.